క్లుప్తంగా

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

– రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు




రాయచోటి టౌన్ : తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకంగా సంక్రాంతి నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాలలో కొత్త కాంతులు నింపాలని ఆకాంక్షించారు. తెలుగులోగిళ్ల శుభాలకు, సుఖసంతోషాలకు నెలవు కావాలని, రైతులు ఇంటి ఆనందాలు వెల్లివిరియాలని ప్రార్థించారు. ప్రజలు, అధికారులు, నాయకులు, కార్యకర్తలకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు.

16న చెయ్యేరులో సంకాంత్రి సంబరాలు

నందలూరు(రాజంపేట) : ఈనెల 16న చెయ్యేరులో సంక్రాంత్రి సంబరాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎద్దుల బండి పోటీలు, మిమిక్రీ, డ్యాన్స్ బేబి డ్యాన్స్ పోటీలు జరుపుతున్నామని పేర్కొన్నారు. విజేతలకు జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నామని చెప్పారు. వివరాలకు 9515253515, 8374202798 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

రామాపురం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ హైదర్ వలీ ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలలో భాగంగా కార్యాలయంలోని నిర్వహించారు. పాత వస్తువులను భోగి మంటల్లో వేసి సరదాగా గడిపారు. కార్యక్రమంలో సిబ్బంది శివ శంకర్, ఉషారాణి, శోభారాణి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

రాజంపేట : టీడీపీ మాజీ ఎమ్మెల్యే పసుపులేటి బ్రహ్మయ్య జయంతి వేడుకను స్థానిక ఏరియా హాస్పిటల్‌లో ఆయన కుమారులు ప్రదీప్, పవన్‌లు నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. రాజంపేట, నందలూరులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన నాయకులు, బ్రహ్మయ్య అభిమానులు పాల్గొన్నారు. బ్రహ్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామ పొలిమేరల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అద్దెకు బస్టాండ్ స్థలాలు, గదులు

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ బస్టాండులోని ఖాళీ స్థలాలు, గదులు అద్దెకు ఇవ్వనున్నట్లు డీఎం రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు డీఎం కార్యాలయంలో లేదా 9959225775, 7382868442. 7382868289 నెంబర్లలో సంప్రదించాలన్నారు. టెండరు ఫారాలను 19 తేదీ సాయంత్రం 5 గంటలకు విక్రయించబడుతాయన్నారు. పూర్తిచేసిన టెండరు ఫారాలు 20లో రాయచోటి డీపీటీఓ కార్యాలయంలో సీల్డ్ కవరులో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌ను చూడగలరని కోరారు.

బయోటెక్నాలజీలో డాక్టరేట్



సూటి సుబ్బరాయుడు

పెనగలూరు : కొండూరు పంచాయతీ గట్టువారిపల్లెకు చెందిన సూటి సుబ్బరాయుడు అనే బయోటెక్నాలజీ పరిశోధక విద్యార్థికి స్విమ్స్ డాక్టరేట్ ప్రదానం చేసింది. క్యారెక్టరైజేషన్ ఆఫ్ మాలిక్యూర్ ఇన్‌ఫ్రాక్షన్స్ ఆఫ్ మెథాక్సీ, మిథైల్, ఆక్సీ పెరిడిన్, కార్బమైడ్ అంశాలపై పరిశోధన చేయడంతో స్విమ్స్ బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ పీవీజీకె శర్మ పర్యవేక్షణలో సూటి సుబ్బరాయుడుకు డాక్టరేట్ లభించింది.

సారా ఊట ధ్వంసం

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలం ముద్దలదొడ్డి పరిసర ప్రాంతంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక శుక్రవారం తెలిపారు. వివరాలిలా..ముద్దలదొడ్డి సమీపంలో నాటుసారా వండుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బంది దాడులు నిర్వహించి సుమారుగా 800 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

ధ్యాన మందిరం ప్రారంభం

కడప అర్బన్: పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పిరమిడ్ ధ్యాన మందిరం, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్ట్, టెన్నిస్ కోర్ట్, షటిల్ కోర్టులను శుక్రవారం సాయంత్రం కర్నూలు రేంజ్ డి.ఐ.జి ఎస్. సెంథిల్‌కుమార్ ప్రారంభించారు. పోలీసులు సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంబరాల సంక్రాంతికి వేళాయె

- ఉత్సాహభరితంగా సాగిన సంక్రాంతి సంబరాలు
- ఎమ్మెల్యే మేడా ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు
- భోగి మంటతో సంబరాలను ప్రారంభించిన మేడా, ఆకేపాటి, పోలా



సంబేపల్లె సచివాలయంలో ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం



విజేతలకు బహుమతులను పంపిణీ చేస్తున్న డాక్టర్ రెడ్డెన్న తదితరులు



రాజంపేట టౌన్: లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న మహిళలు



రాజంపేట టౌన్: భోగి మంటతో సంక్రాంతి వేడుకలను ప్రారంభిస్తున్న మేడా, ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఇన్‌ఫాంట్ జీసెస్ హైస్కూల్‌లో శుక్రవారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. తొలుత సంక్రాంతి వేడుకలను ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి భోగిమంటకు నిప్పంటించి వేడుకలను ప్రారంభించారు. సంక్రాంతి సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే సాంప్రదాయ కార్యక్రమాలన్నింటిని నిర్వహించారు. డూడూ బసవన్నల విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ తప్పెట్లు వాయించి అందరిని ఉత్సాహపరిచారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు పాడిన గొబ్బెమ్మ పాటలు పాతతరం రోజులను గుర్తు తెచ్చాయి. మహిళా కౌన్సిలర్లు సైతం గొబ్బెమ్మ పాటలతో అలరించారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ వేర్వేరు జట్లుగా ఏర్పడి కబడ్డీ, టగ్‌ఆఫ్‌వార్ పోటీల్లో ఉత్సాహభరితంగా పాల్గొన్నారు. సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో మహిళలు పాల్గొన్నారు. పదహారణాల తెలుగు అమ్మాయి పోటీల్లో యువతుల హావభావాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆర్డీఓ కోదండరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డిలతోపాటు పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సాంప్రదాయ దుస్తులు ధరించి వచ్చారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి నెలవులాంటిదన్నారు. ప్రజలు ఆధునికతవైపు ఆకర్షితులై సాంప్రదాయాలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజలకు సంక్రాంతి గొప్పతనం తెలుసుకునే అవకాశముందని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర వ్యాయామ విద్య తనిఖీ అధికారి జి.భానుమూర్తిరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గుల్జార్‌బాషా, దాసరి చిదానంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని పుల్లంపేటకు చెందిన పి.విజయలక్ష్మి రూ.15 వేలు, ద్వితీయ బహుమతి నందలూరుకు చెందిన జి.లక్ష్మిదేవి రూ.10 వేలు, తృతీయ బహుమతి రాజంపేటకు చెందిన వసంత రూ.5 వేలు, నాల్గవ బహుమతి రాజంపేటకు చెందిన కె.రాజేశ్వరీ రూ.3 వేలను ఎమ్మెల్యే అందజేశారు. అలాగే మ్యూజికల్ చైర్స్‌లో ప్రథమ బహుమతి పి.శివకుమారి, ద్వితీయ బహుమతి డి.సునీత, తృతీయ బహుమతి రాణి కైవసం చేసుకున్నారు. లక్కీ ఉమెన్ ఇన్ రాజంపేట పోటీల్లో ప్రథమ బహుమతిని ఎం.గీతిక, ద్వితీయ బహుమతి ఈశ్వరమ్మ, తృతీయ బహుమతి లలిత గెలుపొందారు. పదహారణాల తెలుగు అమ్మాయి పోటీల్లో ప్రథమ బహుమతి గుర్రంకొండ జాహ్నవి, ద్వితీయ బహుమతి యశశ్విని, తృతీయ బహుమతి జైన గెలుపొందారు. లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో ప్రథమ బహుమతి ఉషారాణి, ద్వితీయ బహుమతి జి.వసంత, తృతీయ బహుమతి జె.దివ్యశ్రీ గెలుపొందారు. అలానే కబడ్డీ పోటీలో మునిసిపల్ చైర్మన్ జట్టు విజయం సాధించగా, టగ్‌ఆఫ్‌వార్ పోటీల్లో ఎమ్మెల్యే జట్టు గెలుపొందింది.

ప్రజలందరికి సంక్రాంత్రి శుభాకాంక్షలు
ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : భోగా భాగ్యాలనిచ్చే భోగి, సరదానిచ్చే సంక్రాంత్రి, కమ్మని కనుమ పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులను నింపాలని కోరుకుంటున్నట్లు రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మేడాభవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ సంక్రాంత్రిని ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు అన్ని విధాలుగా మేలు జరగాలని ఆ దేవదేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

500 మందికి చీరల పంపిణీ

రాజంపేట : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలితోపాటు సిద్దులపల్లె, సమీప గ్రామాలకు చెందిన దళితవాడల్లో 500 మందికి పైగా మహిళలకు చీరలను ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి పంపిణీ చేశారు. యేటా ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి యేటా సంక్రాంత్రి పండుగను పేదలకు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో తమవంతుగా చీరలు పంపిణీ చేసినట్లు ఎల్లారెడ్డి తెలిపారు.

సచివాలయంలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

సంబేపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా సంబేపల్లె సచివాలయంలో శుక్రవారం ముగ్గుల పోటీలు జరిగాయి. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పోటాపోటీగా ముగ్గుల పోటీలలో పాల్గొన్నారు. సచివాలయ ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. వైఎస్ఆర్‌సీపీ మండల నాయకుడు వివి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్రల ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులను అందజేశారు. సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుందన్నారు. అనంతరం బ్యాడింటన్ పోటీలలో విజేతకు రూ.2 వేలు, రన్నరప్‌కు రూ.1000 నగదు బహుమతులను అందజేశారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : ఇళ్ళముందు వేసే ముగ్గులు భారత సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు అని ప్రభుత్వ కంటి వైద్యుడు రెడ్డెన్న, వీఆర్‌డీఎస్ సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డిలు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సీపీఐ మహిళా సమాఖ్య నాయకురాలు మర్రి సుమిత్రమ్మ ఆధ్వర్యంలో పాత రాయచోటిలో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు ఆయన బహుమతులను పంపిణీ చేశారు.



పేదమహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి

కార్యక్రమంలో సీపీఐ నేతలు సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, వెంకటేశు, బీఎస్పీ నేత యుగంధర్, వైఎస్ఆర్‌సిపి నేత బుజ్జిబాబు, మహిళా సమాఖ్య నాయకురాళ్ళు సుబ్బమ్మ,నాగమ్మ, దళితనేత నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు పల్లెల్లో స్నేహభావాన్ని పెంచుతాయి

రాయచోటి : పల్లె ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు యువకులలో క్రీడా నైపుణ్యాన్ని నింపడంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు బి.సిద్ధారెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డిలు అన్నారు. రాయచోటి రూరల్ మండలంలోని కాలభైరవ స్వామి గుడి దగ్గర క్రికెట్ పోటీ విజేతలకు శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో నియోజకవర్గ పరిధిలోని 14 టీంలు పాల్గొనడం శుభదాయకమన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లోని యువకులకు ప్రోత్సాహకరంగా ఉండాలని ఈ క్రీడలను నిర్వహించామన్నారు. ఫైనల్‌గా బుడ్డావాండ్లపల్లె మరియు ముసల్‌రెడ్డిగారిపల్లె టీంలు హోరాహోరీగా తలబడ్డాయి. ఈ పోటీ మ్యాచ్‌లో బుడ్డావాండ్లపల్లె జట్టు విజేతగా నిలిచింది. ఆట చివరి రోజున పోటీలలో పాల్గొన్న 14 జట్ల సభ్యులను పిలిపించి సహపంక్తి భోజనాన్ని నిర్వహించారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా సిద్ధారెడ్డి సుబ్బారెడ్డిల సహకారాన్ని మరువలేమని టీమ్‌ల లీడర్లు కొనియాడారు.

మాలమహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక

రాజంపేట రూరల్ : మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ్ ఆధ్వర్యంలో రాజంపేట మండల నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల మాల మహానాడు యూత్ అధ్యక్షుడిగా తాళ్లపాక పంచాయతీ సిద్దలపల్లెకు చెందిన బొమ్మిశెట్టి హరినాథ్, యూత్ ప్రధాన కార్యదర్శిగా హస్తవరం పంచాయతీకి చెందిన ఒంటిమిట్ట శ్రీనివాసులు, యూత్ ఉపాధ్యక్షులుగా గుండ్లూరు పంచాయతీ రామాపురానికి చెందిన రాజుబోయినను ఎన్నుకున్నారు. దళిత నాయకులు ఏ.విశ్వనాథ్, కాకి చంద్ర, మల్లికార్జున, జి.సుధాకర్, సి.నరసింహులు, పి.శంకరయ్య పాల్గొన్నారు.

ఆర్డీఓకు వీడ్కోలు

రాజంపేట : రాజంపేట ఆర్డీఓ కోదండరామిరెడ్డికి శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. తహసీల్దారు, రెవెన్యూ అధికారులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయంలో వీడ్కోలు విందును ఏర్పాటు చేశారు. కాగా ఈయనను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న భద్రకాళి అమ్మవారు

రాయచోటి టౌన్ : భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రంగురంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు రాహుకాల పూజల విశిష్టతను వివరించి చెప్పారు. పూజల్లో ఆలయ పాలకమండలి అధ్యక్షులు పి.విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్యస్వామి, రాచరాయ యోగీ స్వాములు నిర్వహించారు.

ఆకేపాటి దృష్టికి మందపల్లి సమస్యలు



జెడ్పీ చైర్మన్ ఆకేపాటికి సమస్యలు తెలియజేస్తున్న మందపల్లివాసులు

రాజంపేట రూరల్ : తమ సమస్యలు పరిష్కరించాలని మందపల్లి వాసులు జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని కోరారు. శనివారం మందపల్లి పంచాయతీలో ఆకేపాటి అభివృద్ధి పనులను పరిశీలనలో భాగంగా మందపల్లికి వచ్చారు. గ్రామంలో విద్యుత్ సరఫరా సరిగా రావడం లేదని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా అటవీ శివారులోని మారుమూల గ్రామమైన అడవిరాచపల్లె గ్రామం నుంచి ఎస్టీ కాలనీ వరకు సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరిస్తానని గ్రామస్తులకు ఆకేపాటి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కె.శ్రీహరి, గ్రామస్తులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హేమాద్రివారిపల్లిలో దుస్తుల పంపిణీ

మున్సిపల్ కౌన్సిలర్ పెనిగిలపాటి పెంచలయ్య నాయుడు ఆధ్వర్యంలో మండల పరిధిలోని తాళ్లపాక పంచాయతీలోని హేమాద్రివారిపల్లిలో శనివారం దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి దుస్తులను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది సంక్రాంతికి ముందు పెంచలయ్య నాయుడు మహిళలకు చీరలు, పురుషులకు పంచె టవల్ పంపిణీ చేయడం శుభపరిణామమని ఆకేపాటి కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి పెంచలయ్య, అర్జున్ రాజు, సుబ్బరాజు, చిన్న శేషమరాజు, పెద్దశేషమరాజు, తదితరులు పాల్గొన్నారు.

గుండ్లూరులో....

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, గుండ్లూరు సర్పంచ్ ఏటీ మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గుండ్లూరులో శనివారం దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి దుస్తులను మహేష్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ప్రతి ఏడాది సంక్రాంతికి ముందు తన తండ్రి పద్మాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం మహేష్‌రెడ్డి వందలాది మందికి మహిళలకు చీరలు, పురుషులకు పంచె టవల్ పంపిణీ చేయడం మరువరానిదని ఆకేపాటి కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు జి.కల్యాణ్‌కుమార్ రెడ్డి, కే.శ్రీహరి, లోకా, ఏ.మధు యాదవ్, మధురాజు, లక్ష్మణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : మండలంలో ఉండే జగనన్న కాలనీలోని లబ్దిదారులచే పక్కా గృహాల పనులు వేగవంతం చేయిచాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్ రెడ్డి గ్రామ కార్యదర్శులకు, విఆర్‌వోలకు సూచించారు. మండల కేంద్రమైన సిద్దవటం లోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గ్రామ కార్యదర్శులు, వీఆర్‌వోలు, వలంటీర్లకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరిపేందుకు సిబ్బంది సహకరించాలన్నారు. వారికి ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరిస్తామని సూచించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం చేయకూడదని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

17న చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలు



గాలివీడు : ఆవులశెట్టివారిపల్లిలో వెలసిన చౌడేశ్వరీ దేవి జ్యోతి ఉత్సవాలను ఈనెల 17వ తేదీ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, చౌడేశ్వరీ దేవి భక్తులు తెలిపారు. బాణసంచా, ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఉత్సవాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

రైతులు పంట నమోదు చేసుకోండి



మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : రబీ సీజన్‌లో రైతులందరూ పంట నమోదు చేసుకోవాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 50శాతం సబ్సిడీపై జిప్సమ్ జింక్ అందజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సహిస్తుందని, రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించాలని కోరారు. ఇందుకు గ్రామ సచివాలయాలలోని రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు ఇస్తారన్నారు. వ్యవసాయ అధికారి శ్రీరాములు మాట్లాడుతూ వరిపంటలో కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు, ఎరువులు ఎంత మోతాదులో వాడాలి, ఎలా వాడాలన్న విషయాలపై రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారిణి డి నాగమ్మ, గ్రామాల రైతులు పి.జయరామయ్య, లోకేశ్వరరెడ్డి, చిల్లా ఈశ్వర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ సిబ్బంది గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాభివృద్ధికి మరింతగా కృషి



విజేతలను అభినందిస్తున్న సీఐ చంద్రశేఖర్

రాయచోటి అర్బన్ : జిల్లాలో హాకీ క్రీడాభివృద్ధిగా మరింత కృషి సల్పుతామని రాజు హాకీ అకాడమీ ఫౌండర్, దిశ సీఐ చంద్రశేఖర్ రాజు విద్యాసంస్థల అధినేత జగన్‌మోహన్‌రాజులు పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని ధ్యాన్‌చంద్ అకాడమీ ఆధ్వర్యంలో కడపలో నిర్వహించిన అండర్-14 విభాగం హాకీ పోటీలలో రాజుహాకీ అకాడమీకి చెందిన బాలుర, బాలికల జట్టు విజేతలుగా నిలిచాయి. ఇదే సమయంలో సీనియర్ బాలుర పోటీల్లో రన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులను శుక్రవారం వారు అభినందించారు. ఈ ప్రాంత క్రీడాకారులు హాకీలో రాణించడం ద్వారా రాయచోటి పేరు ప్రతిష్టలను మరింతగా ఇనుమడింపచేయాలంటూ వారు కోరారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి ఈ.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నరసింహాచారి, ట్రెజరర్ ఖదీరుల్లాఖాన్, కోచ్‌లు సుబ్బు, వెంకట్, నారాయణ, పూజిలతో పాటు హాకీ అకాడమీ విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బెస్తపల్లెలో ఆక్రమణలు తొలగించండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

పెనగలూరు : మండలంలోని బెస్తపల్లె సర్కిల్ వద్ద ఆక్రమణలు తొలగించాలని సీపీఐ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా కార్యదర్శి కేశం ప్రసాద్‌లు మాట్లాడుతూ బెస్తపల్లె సర్కిల్ వద్ద రోడ్డుకిరువైపులా ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి దుకాణాలు నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ఆక్రమణదారులపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దారు కార్యాలయ సిబ్బంది వినతిపత్రాన్ని సమర్పించారు. సీపీఐ మండల కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ, సహాయ కార్యదర్శి లక్ష్మినారాయణ, బీకేఎంయూ మండల కార్యదర్శి భాస్కర్, సీపీఐ చిట్వేలి మండల సహాయ కార్యదర్శి గంగయ్య, ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఈరి సుబ్బరాయుడు, వెంకటేష్, అనిల్, శివ, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసులు

మదనపల్లె సిటీ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరుణాచలంకు వచ్చే నెల 4న ప్రత్యేక బస్సు సర్వీసును నడపన్నుట్లు ఆర్టీసీ డిపో- 1 మేనేజర్ మూరె వెంకటరమణారెడ్డి తెలిపారు. పౌర్ణమి పురస్కరించుకు సూపర్ లగ్జరీ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8.30 గంటలకు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనాలు అనంతరం అరుణాచలంకు వెళ్లి గిరి ప్రదక్షిణ తరువాత మదనపల్లెకు మరుసటి రోజు చేరుకుంటుందన్నారు. వెళ్లే భక్తులు ముందుగానే సీట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు తదితరులు

రాయచోటి అర్బన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్, స్టిక్కర్, పోస్టర్‌లను వైఎస్ఆర్‌సీపీ మదనపల్లె నియోజకవర్గ పరిశీలకుడు హబీబుల్లాఖాన్ శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాషాభివృద్ధికి జగనన్న ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. పాఠశాలలకు మౌళిక వసతుల కల్పన, విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, మున్సిపల్ కౌన్సిలరులు అల్తాఫ్, గౌస్‌ఖాన్, అంజుమన్ తరఖీ ఉర్దూ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హాషీం, రూటా జిల్లా కార్యదర్శి సిబాతుర్ రహిమాన్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మహమ్మద్ అలీ, నేతలు ఇలియాస్‌బాషా, మున్వర్‌బాషా, సునీర్, ఆరీఫ్, సయ్యద్‌బాషా, సద్దాంతోపాటు పలువురు ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద శుక్రవారం సాయంత్రం ఏపీ రైతుసంఘం ముద్రించిన క్యాలెండర్‌ను సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, ప్రజాసంఘాల నేతలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకులు రైతాంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. రైతులకు వ్యవసాయాభివృద్ధిలో తగురీతిలో చేయూతనివ్వడం లేదన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు విశ్వనాథనాయక్, ఈశ్వర్, రామాంజులు, రెడ్డెయ్య, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలో 2023–24వ ఆర్థిక సంవత్సరానికి చెందిన విద్యుత్ చార్జీలపై ఫిర్యాదులుంటే ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు డివిజినల్ విద్యుత్‌శాఖ ఈఈ ఆర్ చంద్రశేఖర్ రెడ్డి శనివారం తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో విశాఖపట్టణం నుంచి మూడురోజులపాటు ఈ ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలియజేశారు. డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కేంద్రం నుంచి వినియోగదారులు ఆన్‌లైన్‌లో తమ అభిప్రాయాలను ఏపీఈఆర్‌సీకి తెలియజేయవచ్చునని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.